# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాల్లో పర్యటించనున్నారు.
- ❖ భారత్‌లో పెట్టుబడులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆస్ట్రియా కంపెనీలను ఆహ్వానించారు.
- ❖ మత్స్యకారులకు ఇవ్వాల్సిన సబ్సిడీలను త్వరలో అందిస్తామని మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- ❖ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధితో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాల్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించనున్నారు. రేపు ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని ఆయన నివాసం నుండి బయలుదేరి 11 గంటల 20 నిమిషాలకు అనకాపల్లి చేరుకుంటారు. జిల్లాలోని దార్లపూడి వద్ద ఉన్న పోలవరం ఎడమ కాలువను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అనంతరం విజయనగరం జిల్లాకు బయలుదేరి, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంను సందర్శిస్తారు. అక్కడ పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షిస్తారు. అలాగే మెడ్ టెక్ జోన్ లో 2 గంటల దృశ్య మాధ్యమం ద్వారా సీఐఐ కాన్ఫరెన్సులో పాల్గొంటారు. సాయంత్రం విశాఖపట్నం విమానాశ్రయం ప్రాంగణంలో అధికారులతో సమావేశమై గత ఐదేళ్లలో నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఉండవల్లికి ముఖ్యమంత్రి తిరుగు పయనమవుతారు. కాగా ముఖ్యమంత్రి పర్యటనకి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశామని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రఖ్యాత భారత ఆస్ట్రియన్ కంపెనీల ప్రతినిదులతో ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రియన్ ఛాన్సలర్ కార్ల్ నెహమ్మర్ ఈరోజు వియన్నాలోని హాఫ్‌బర్గ్ ప్యాలెస్‌లో వర్తక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, హరిత రంగాలు, అంకురా సంస్థలు సహా వివిధ రంగాలలో భారత ఆస్ట్రియన్ కంపెనీల మధ్య సహకారం ఆవశ్యకతను ప్రధాని ప్రస్తావించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆస్ట్రియా కంపెనీలను మోదీ ఈ

సందర్భంగా ఆహ్వానించారు. అంతకు ముందు ప్రధాని మోదీకి వియన్నా విమానాశ్రయంలో ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్ బర్గ్ స్వాగతం పలికారు. కాగ ప్రస్తుతం ఇరుదేశాలు దౌత్య సంబంధాలు ఏర్పాటు చేసుకొని 75 ఏళ్లు పూర్తయినట్లు భారత విదేశాంగశాఖ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో మత్స్యశాఖ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు జాతీయ మత్స్యశాఖ దినోత్సవరం సందర్భంగా మత్స్యకారుల అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు విజయవాడలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అత్యంత సుదీర్ఘ సాగరతీరం ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, మత్స్యశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి సారిగా మత్స్యశాఖపై ఈరోజు సమీక్ష నిర్వహించానని తెలిపారు. ఫిషింగ్ హార్బర్లు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, నాలుగు హార్బర్లలలో రెండు మాత్రమే పని చేస్తున్నాయని తెలిపారు. హార్బర్లు ఎక్కువగా ఉంటేనే మత్స్య సంపద అభివృద్ధి చెందుతుందని, మత్స్యకారులకి ఇవ్వాల్సిన సబ్సిడీలను త్వరలోనే అందిస్తామని మంత్రి అచ్చెంన్నాయుడు వివరిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆర్థిక శాఖ అధికారులతో అమరావతిలోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. త్వరలో ఆర్థిక శాఖపై  శ్వేతపత్రం విడుదల చేయనున్న నేపథ్యంలో రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న అప్పులు, ఆదాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే అన్ని రకాల అప్పులు కలిపి మొత్తం 14 లక్షల కోట్ల రూపాయల వరకు ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పెండింగ్ బిల్లులు ఎంత ఉన్నాయనే అంశంపై శాఖల వారీగా వివరాలు కోరినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతినిధులు ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడుతో ఈరోజు సమావేసంయ్యారు. సుమారు 60 వేల కోట్ల రూపాయలతో రాష్ట్రంలో పెట్రోల్ రిఫైనరీ పరిశ్రమ ఏర్పాటు అంశంపై బీపీసీఎల్ ఛైర్మన్, ఎండీ కృష్ణకుమార్, సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రితో ఈ సమావేశంలో చర్చించారు. కాగా ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా చంద్రబాబు నాయుడు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురిను కలిసి మచిలీపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుచేయాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏజెన్సీ ప్రాంతాలలో గంజాయి నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యరాణి అన్నారు. ఈ రోజు అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో భాగంగా పాడేరులోని కలెక్టరేట్ లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గంజాయి సాగును అరికట్టి, గిరిజన రైతులను కాఫీ, మిరియాలు లాంటి  ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తామన్నారు. గిరిజన విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలలో  మెరుగైన  పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. ఆశ్రమ పాఠశాల్లో గతంలో మాదిరిగానే వైద్య సిబ్బందిని నియమిస్తామని మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు త్వరలో కొత్త పాలక మండళ్లు ఏర్పాటు చేస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారిని కుటుంబసమేతంగా ఈరోజు ఆయన

దర్శించుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.... రాష్ట్రంలోని ఎనిమిది ప్రధాన దేవాలయాల్లో సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలపై సమీక్షిస్తున్నామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధితో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ.....

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జల్ శక్తి అభియాన్ లక్ష్యాలను ప్రజలకు తెలియజేసి వారిని భాగస్వామ్యుల్ని చేయాలని కేంద్ర ఉక్కు శాఖ డైరక్టర్ దేవిదత్త సత్పతి అన్నారు. ప్రకాశం జిల్లాలో డ్వామా ఆధ్వర్యంలో నిర్వహించిన జల్ శక్తి అభియాన్ పనుల పురోగతిని పరిశీలించడానికి దేవిదత్త సత్పతి ఆధ్వర్యంలోని కేంద్ర బృందం రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు జిల్లాలో పర్యటించింది. అనంతరం దేవిదత్త సత్పతి పాత్రికేయులతో మాట్లాడుతూ... జలమే జీవమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, జల్ శక్తి అభియాన్ ఈ సంవత్సరం నారీ శక్తి - జల్ శక్తి అన్న నినాదంతో ముందుకు వెళుతోందన్నారు. అలాగే జిల్లాలో అమృత సరోవర్లు, జల్ శక్తి కింద చేపట్టిన పనులు వాటి జియో ట్యాగింగ్ తదితర విషయాలను పరిశీలించామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో కోత దశలో ఉన్న వరి పంట ముంపు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి నీరు దిగువకు పారేలా చర్యలు చేపట్టాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు అమలాపురం కలెక్టరేట్ లో జలవనరులు వ్యవసాయ, ఉద్యాన శాఖల పనితీరుపై ఆయన సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతు సేవ కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్ లో రైతాంగానికి ఎరువులు, క్రిమిసంహారక మందులు సకాలంలో అందించాలని, అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రాయితీపై అందించి అధిక దిగుబడులు సాధించే దిశగా రైతాంగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఎరువులు కొరత రాకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాల లని అధికారులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ, విదేశాల నుండి ప్రతి రోజు శ్రీవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు మరింత రుచికరమైన అన్న ప్రసాదాలు అందించేందుకు ఇటీవల తీసుకున్న చర్యలతో ఆహార నాణ్యత బాగా పెరిగిందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు పేర్కొన్నారు. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని ఈరోజు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.... తిరుమలలో ప్రతిరోజు 2 లక్షల మందికి అన్నప్రసాదాలు అందిస్తున్నామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బడుగు, బలహీన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సంజీవరెడ్డి గారి సవిత అన్నారు. ఈ రోజు అనంతపురంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, 2014 నుంచి 19 వరకు వెనుకబడిన సంక్షేమ పాఠశాలల నిర్మాణం జరిగాయని, గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వసతి గృహాలు అధ్వాన్నస్థితికి చేరాయని అన్నారు. వచ్చే ఏడాది పాఠశాలలు, తరగతి గదులను పెంచుతామని, అలాగే వసతి గృహాలలో తనిఖీలు చేపట్టాలని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాగునీటికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈరోజు ప్రకాశం బ్యారేజి వద్ద ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

పట్టిసీమ లిఫ్ట్ నుంచి వచ్చిన నీళ్ళు ఇప్పుడు కృష్ణా డెల్టాలో దాహార్తి తీరుస్తున్నాయన్నారు. సమర్ధవంతమైన జలవనరుల నిర్వహణతో  రాష్ట్రం సుభిక్షమవుతుందని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =